# 22 ఎకరాల్లో తీరొక్క పంటలు

- సాగు ప్రయోగశీలి.. తిరుపతిరెడ్డి
- పొలం ఒక్కటే.. పంటలు మూడు
- సీజనల్ పంటల సేద్యానికి ప్రాధాన్యం
- వ్యవసాయ క్షేత్రాలకు సోలార్ కంచె
- మూడు దశాబ్దాలుగా సేద్యమే నేస్తం



ఇబ్రహీంనగర్‌లో తిరుపతిరెడ్డి సాగు చేస్తున్న బొప్పాయి తోటలో అంతర పంటగా వాటర్ మిలన్



జగిత్యాల, జనవరి 25 (నమస్తే తెలంగాణ): తాతల కాలం నుంచి అవే వరి, మక్క, పసుపు పంటలు.. ఆశగా మొగులుకు ఎదురుచూపులు.. కాలంగాక నష్టాలు.. సాయం కోసం షావుకారు చుట్టూ కాళ్లరిగేలా ప్రదక్షిణలు.. తెలంగాణలోని దాదాపు అన్ని గ్రామాల్లో పదేండ్ల క్రితం వరకు ఇవే పరిస్థితులు.. ఇప్పుడు పరిస్థితులు మారాయి. రైతుల పంట సాగుతీరులోనూ వినూత్న మార్పులు వచ్చాయి. సంప్రదాయ పంటలకు స్వస్తి చెప్పి.. వాణిజ్య, నిత్యం లాభాలు వచ్చే పంటలనే పండిస్తున్నారు. వ్యవసాయ క్షేత్రాన్ని ప్రయోగశాల మార్చి ఆధునిక సేద్యం చేస్తున్నారు జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం ఇబ్రహీంనగర్ (శ్రీరాములపల్లి)కు చెందిన గుండేటి తిరుపతిరెడ్డి. సేద్యాన్ని కొత్త పుంతలు తొక్కిస్తూ లాభాలు ఆర్జిస్తున్నాడు. సేద్యాన్ని వృత్తిగా కాకుండా జీవన విధానంగా మార్చుకొన్న తిరుపతిరెడ్డి.. తనకున్న 22 ఎకరాల్లో తీరొక్క పంటలు పండిస్తున్నారు. తిరుపతిరెడ్డి తల్లిదండ్రులు, అన్నదమ్ములు అందరూ వ్యవసాయదారులే. టెన్త్ వరకు చదివిన తిరుపతిరెడ్డి.. తొలి రోజుల్లో సంప్రదాయ పద్ధతిలో వరి వేశారు. పెద్దగా గిట్టుబాటు రాలేదు. వరి, పసుపు, మక్కజొన్న సాగు చేశారు. అయినా లాభం రాలేదు. వ్యవసాయంలో కొత్త పద్ధతులు పాటించాలని భావించిన తిరుపతిరెడ్డి.. 22 ఎకరాల్లో వరి సాగును తగ్గించారు. ఐదు ఎకరాల్లో దొడ్డు రకం వరి వేశారు. 11 ఎకరాల్లో మామిడితోటలు పెంచారు. డిమాండ్ ఉండే బంగినిపెల్లి, హిమాయత్, దశేరి రకం చెట్లను పెంచారు. నాలుగేండ్ల క్రితం రెండెకరాల్లో జామ సాగు చేశారు. తైవాన్ జామ, అలహాబాద్ సఫేద్ రకాన్ని సాగు చేశారు. నాలుగేండ్లలో ఏటా రూ.4 లక్షల చొప్పున లాభం ఆర్జించారు. జామ, సీతాఫల్, బొప్పాయి ఎకరంలో సాగు ప్రారంభించారు. ఒక్కో రకానికి చెందిన 500 చెట్ల చొప్పున 1500 చెట్లు ఒక ఎకరం విస్తీర్ణంలోనే పెంచారు. ఎకరంలో బొప్పాయి, మరో ఎకరంలో మిర్చి, పసుపు పంటలను సాగు చేస్తున్నారు. ఎకరం బొప్పాయి తోటలో అంతర పంటగా పుచ్చ పంట వేశాడు. 90 రోజుల్లో పంట చేతికి వచ్చి 110 రోజుల్లో పంట ముగిసిపోతుంది. నెలలో రోజుకు రూ.8 వేల నుంచి రూ.10 వేల దాకా ఆదాయం వస్తున్నది. సీజన్‌తో సంబంధం లేకుండా జామతోటలతో నిత్యం లాభాలు వస్తున్నాయి. వరి మినహా అన్ని పంటలను డ్రిప్ ఇరిగేషన్ పద్ధతిలోనే సాగుచేస్తున్నాడు. పంటలను కాపాడుకునేందుకు వ్యవసాయ క్షేత్రం చుట్టూ సోలార్ ఫెన్సింగ్ పెట్టాడు. సోలార్ ప్లాంట్‌ను సైతం ఏర్పాటు చేసుకున్నారు.

## మనసుంటే మార్గం ఉంటుంది..



మనస్ఫూర్తిగా అంకితభావంతో పనిచేస్తే ఎక్కడైనా మంచి ఫలితాలు వస్తాయి. మోటర్‌తో పది గుంటలకు పారించే నీళ్లతో డ్రిప్ ఇరిగేషన్‌లో రెండెకరాలకు నీళ్లు పారించవచ్చు. డ్రిప్‌పైనే సేద్యం చేయాలి. డ్రిప్ ఏర్పాటుకు ప్రభుత్వం సబ్సిడీ ఇవ్వాలి. ఒక్క ఆయిల్ ఫాంకు డ్రిప్ సబ్సిడీపై ఇవ్వడం సరికాదు. రైతులు సీజనల్ పంటలను సాగు చేస్తే లాభాలు ఉంటాయి. అంతరపంటలను అధికంగా సాగు చేయాలి. ఒకటి రెండు పంటలను సాగు చేస్తే రైతు నష్టపోతాడు. మూడు నాలుగు పంటలను వేస్తే ఒకటి నష్టపోయినా మరో దాంట్లో లాభం వస్తుంది. రైతులు ఆ దిశగా ఆలోచించాలి. కోతుల బెడదను ప్రభుత్వం తీర్చాల్సిన అవసరం ఉన్నది.

**- గుండేటి తిరుపతిరెడ్డి, ఇబ్రహీంనగర్**

# మేడిగడ్డ పనుల్లో కానరాని పురోగతి

- మూడునెలలైనా పూర్తికాని టెస్టింగ్
- బరాజ్ వద్ద కనిపించని ఏజెన్సీల నిపుణులు
- సర్కారే తాత్సారం చేస్తున్నట్టు అనుమానం!

జయశంకర్ భూపాలపల్లి, జనవరి 25 (నమస్తే తెలంగాణ)/మహదేవపూర్: జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బరాజ్ పనుల్లో పురోగతి కనిపించడం లేదు. అక్టోబర్‌లో బరాజ్‌లోని ఏడో బ్లాక్‌లో 20వ ఫియర్ కుంగిన ఘటనపై మూడు నెలలుగా విచారణ కొనసాగుతూనే ఉన్నది. ఇప్పటికే నేషనల్ డ్యాం సేఫ్టీ అధికారులు, రాష్ట్ర డ్యాం సేఫ్టీ అధికారులు, చివరికి విజిలెన్స్ అధికారుల బృందం సైతం మేడిగడ్డను పరిశీలించింది. పియర్స్ కుంగడంపై కారణాలు తెలుసుకునేందుకు ఇన్వెస్టిగేషన్ పనులు డైనోసార్, హట్సన్ ఏజెన్సీలకు అప్పగించింది. అయితే మూడు నెలలుగా ఇన్వెస్టిగేషన్ పనులు మొక్కుబడిగా కొనసాగుతున్నాయి. బరాజ్ వద్ద పనుల్లో ఎలాంటి చొరవ కనిపించడం లేదు. పియర్స్ వద్ద సీరియస్‌గా పనులు చేపట్టి కారణాలు తెలుసుకునే ప్రక్రియ ఇంతవరకు జరుగడం లేదు. ఇదిలావుండగా గురువారం బరాజ్ వద్ద పనులు జరుగుతున్న దాఖలాలు కనిపించలేదు. 19, 20, 21వ పియర్స్‌తోపాటు మిగిలిన పియర్స్ వద్దకు ఇసుకతో రోడ్లు వేశారు. ఏడో బ్లాకు వద్ద ఇసుక కుప్పలు పోశారు. లారీలు ఎక్కడికక్కడే నిలిచిపోయి ఉన్నాయి. బరాజ్ వద్ద ఎలాంటి ఏజెన్సీల నిపుణులు, సిబ్బంది లేక నిర్మానుష్య వాతావరణం కన్పించింది. బరాజ్ కుంగడంపై కారణాలు తెలుసుకుని నిర్మాణ పనులు ప్రారంభించాలనే ఆలోచన ప్రభుత్వానికి ఉన్నట్టు కనిపించడం లేదు. విజిలెన్స్ అధికారులతో రోజుకో లీకులు ఇస్తూ కాలయాపన చేస్తూ బరాజ్ పనులను మొత్తానికే పక్కన పెట్టే కుట్ర జరుగుతుందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. కాగా ప్రస్తుతం మేడిగడ్డ బరాజ్‌లో పియర్స్ కుంగడంపై అధ్యయనం చేసి పునరుద్ధరణ పనులు సిఫార్సు చేసేందుకు కేంద్ర జల సంఘం మాజీ చైర్మన్ ఏబీ పాండ్యా నేతృత్వంలో ఎనిమిది మందితో కమిటీ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనను నీటి పారుదలశాఖ ప్రభుత్వానికి పంపింది. అధ్యయన కమిటీ బరాజ్ వద్ద పూర్తిస్థాయిలో పరిశీలన జరిపి పియర్స్ కుంగడంపై కారణాలు అన్వేషించి పునరుద్ధరణకు సూచనలు ఇవ్వనుంది. దీంతో మరమ్మతు పనులు వేగవంతమయ్యే అవకాశం ఉన్నది. కాగా ఇంజినీరింగ్ అధికారులు అధ్యయన కమిటీ ఏర్పాటును స్వాగతిస్తున్నారు. ఏది ఏమైనా పియర్స్ కుంగడంపై కారణాలు అన్వేషించి త్వరితగతిన పనులు చేపట్టాలని, వర్షాకాలం ప్రారంభమైతే బరాజ్‌లోకి భారీగా నీరు చేరి తీవ్ర నష్టం జరుగుతుందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.



పనులు చేపట్టకపోవడంతో నిర్మానుష్యంగా ఉన్న మేడిగడ్డ బరాజ్ ప్రాంతం

## ఢిల్లీ రిపబ్లిక్‌డే పరేడ్‌కు 'ఖని' క్యాడెట్లు



రిజియాన్

ఫర్టిలైజర్ సిటీ, జనవరి 25 : ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే పరేడ్‌లో గోదావరిఖని సెక్రెడ్‌హార్ట్ పాఠశాల ఎన్‌సీసీ క్యాడెట్లు ఎస్ రిజియాన్, పూర్వ విద్యార్థి బొజ్జ హైమాకు పాల్గొనే అవకాశం దక్కింది. రిజియాన్ ఆర్మీ వింగ్, హైమా ఎయిర్ వింగ్ తరఫున ఏపీ, తెలంగాణ డైరెక్టరేట్ నుంచి పాల్గొనేందుకు అర్హత సాధించారు.

# వీగిన 'జమ్మికుంట' మున్సిపల్ అవిశ్వాసం

- కౌన్సిలర్ల మధ్య చిచ్చుపెట్టిన హస్తానికి చుక్కెదురు
- ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో అవిశ్వాస పరీక్ష
- కోరం లేక వీగినట్టు ప్రత్యేకాధికారి వెల్లడి

జమ్మికుంట, జనవరి 25: కరీంనగర్ జిల్లా జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ తక్కళ్లపెల్లి రాజేశ్వర్‌రావును పదవి నుంచి దింపాలనే ఉద్దేశంతో కాంగ్రెస్ వేసిన పాచిక పారలేదు. చైర్మన్‌పై 23వ వార్డు కౌన్సిలర్ పొనగంటి మల్లయ్య ఆధ్వర్యంలో పెట్టిన అవిశ్వాసం ఎట్టకేలకు వీగిపోయింది. గురువారం మున్సిపల్ కార్యాలయానికి ప్రత్యేకాధికారి, కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్ చేరుకున్నారు. షెడ్యూల్ సమయం ఉదయం 10 గంటలలోపు చైర్మన్ రాజేశ్వర్‌రావుకు 14 మంది, అవిశ్వాస తీర్మానం పెట్టిన పొనగంటి మల్లయ్య వర్గంలో ఉన్న 16 మంది కౌన్సిలర్లు హాజరవుతారని అందరూ భావించారు. కౌన్సిలర్లు అవిశ్వాసానికా? విశ్వాసానికా? ఎవరికి మద్దతు పలుకుతారో? అని సర్వత్రా ఆసక్తి నెలకొన్నది. కానీ, అందరి అంచనాలను తలకిందులు చేస్తూ 10.20 గంటలకు కేవలం పదో వార్డు కౌన్సిలర్ పొనగంటి విజయలక్ష్మి ఒక్కరే హాజరయ్యారు. ఆ తర్వాత ప్రత్యేకాధికారి అవిశ్వాస పరీక్షను మధ్యాహ్నం ఒంటి గంటకు వాయిదా వేశారు. అప్పటికి కూడా ఇరువర్గాలకు చెందిన కౌన్సిల్ సభ్యులెవరూ హాజరుకాలేదు. మధ్యాహ్నం 1.30 గంటల తర్వాత ప్రత్యేకాధికారి మహేశ్వర్ మీడియాతో మాట్లాడుతూ.. కోరం లేదనందున అవిశ్వాసం వీగిపోయిందని ప్రకటించారు. కాగా ఇద్దరు మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జి, తదితర హేమాహేమీలు ఎంతో ఆరాటంతో చైర్మన్ గిరిని తమ ఖాతాలో వేసుకోబోయి బోల్తాపడ్డారు. కౌన్సిలర్ల మధ్య చిచ్చుపెట్టిన కాంగ్రెస్‌కు చుక్కెదురైంది. కుట్రలను ఛేదించి బీఆర్‌ఎస్ పార్టీ చైర్మన్ స్థానాన్ని నిలబెట్టుకొన్నది. ఆ తరువాత జమ్మికుంటకు వచ్చిన హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ నేతల తీరుపై మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ చిల్లర రాజకీయాలు మానుకోవాలని సూచించారు. అవిశ్వాసాల పేరిట జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌ను ఇబ్బంది పెడితే తాము తిప్పికొట్టినట్టు తెలిపారు.

## మణుగూరు మున్సిపాలిటీపై పిటిషన్

- ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసిన హైకోర్టు

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): షెడ్యూల్డ్ ప్రాంతమైన మణుగూరును మున్సిపాలిటీల జాబితాలో చేర్చడాన్ని వ్యతిరేకిస్తూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. దీనిపై ప్రభుత్వ వైఖరి తెలియజేయాలని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలక, పంచాయతీరాజ్, గిరిజన సంక్షేమ శాఖల ముఖ్య కార్యదర్శులు, కమిషనర్లు, భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్, కొత్తగూడెం, మణుగూరు మున్సిపల్ కమిషనర్లకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేస్తూ సీజే జస్టిస్ అలోక్ ఆరాధే, జస్టిస్ అనిల్ కుమార్ జూకంటితో కూడిన ద్విసభ్య ధర్మాసనం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. గిరిజన ప్రాంతమైన మణుగూరును మున్సిపాలిటీగా మార్చడానికి వీల్లేదని పేర్కొంటూ కొత్త కొండాపురం, మణుగూరు ప్రాంతాలకు చెందిన కోడి నాగరాజు మరో ఇద్దరు హైకోర్టును ఆశ్రయించారు.

## దర్శనం టికెట్లు ఉంటేనే వసతి గదులు : టీటీడీ

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): తిరుమల కొండపై వసతి గదులకు సంబంధించి టీటీడీ కీలక నిర్ణయం తీసుకొన్నది. ఏప్రిల్ నెల శ్రీవారి దర్శన టికెట్లు పొందిన భక్తులకు మాత్రమే మొదటిసారిగా వసతి గదుల కేటాయింపును ఆన్‌లైన్‌లో చేపట్టింది. దీంతో భక్తుల రద్దీని కొంత మేర తగ్గించొచ్చని టీటీడీ భావిస్తున్నది. శ్రీవారి ఆర్జిత సేవలు, లక్కీడిప్, వృద్ధులు, దివ్యాంగులు, శ్రీవాణి ట్రస్టు, రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం టికెట్లను టీటీడీ ఈ నెల 18 నుంచి 24 వరకు జారీ చేసింది. ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసిన రూ.300 ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లను భక్తులు 2గంటల 45 నిమిషాల్లోనే కొనుగోలుచేశారు.






## త్రివర్ణంలో శివయ్య



జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని పురాతనమైన శ్రీ మహదేవస్వామి ఆలయంలో కొలువుదీరిన శివుడు త్రివర్ణ పతాకదారి రూపంలో గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆలయ అర్చకులు శివ లింగాన్ని పూలు, ఆకులతో మూడు రంగుల్లో ముస్తాబు చేయడం భక్తులను విశేషంగా ఆకట్టుకున్నది. - కోరుట్ల

## శారదా పీఠానికి ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): విశాఖ శారదా పీఠానికి ఏపీ హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. తిరుమల తిరుపతి దేవస్థానంలో శారదా పీఠం చేపట్టిన భవన నిర్మాణాలను తక్షణమే నిలిపివేయాలంటూ ఆదేశాలు జారీ చేసింది. తిరుమల గోగర్భం డ్యామ్ వద్ద విశాఖ శారదా పీఠం నిర్మిస్తున్న రెండు భవన నిర్మాణ పనులను నిలిపివేయాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఉల్లంఘనలు ఏ మేరకు జరిగాయో తేల్చేందుకు అడ్వకేట్ కమిషనర్‌ను నియమించింది. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక ఇవ్వాలని కమిషనర్‌ను ఆదేశించింది. కౌంటర్ వేయాలని శారదా పీఠంను ఆదేశిస్తూ విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది.

## సమ్మిరెడ్డికి సింగరేణి సీఎండీ పరామర్శ

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): రామగుండం–1 ఏరియాలోని జీడీకే–2 ఇంక్లైన్‌లో సోమవారం సంభవించిన ప్రమాదంలో గాయపడ్డ మైనింగ్ సర్దార్ సమ్మిరెడ్డిని సింగరేణి సీఎండీ బలరామ్ గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులను ఆదేశించారు.

# శిశువు కిడ్నాప్‌నకు యత్నం

**ప్రతిఘటించిన తల్లి.. ఆగంతకులు పరారీ**



చిన్నారితో తల్లి కవిత

జడ్చర్ల టౌన్, జనవరి 25 : మూడు నెలల శిశువు కిడ్నాప్‌నకు యత్నించిన క్రమంలో బిడ్డను కాపాడుకునేందుకు తల్లి తిరగబడటంతో ఆగంతకులు పరారయ్యారు. ఈ ఘటన మహబూబ్‌నగర్ జిల్లాలో చోటుచేసుకున్నది. చిన్నారి తల్లి కథనం మేరకు.. జడ్చర్ల మున్సిపాలిటీలోని విద్యానగర్ కాలనీలో రవి, కవిత దంపతులు ఓ ఇంట్లో నివసిస్తున్నారు. వీరికి మణిదీప్ (3 నెలలు) ఉన్నాడు. గురువారం ఉదయం రవి వ్యక్తిగత పనుల నిమిత్తం ఇంటి నుంచి బయటకు వెళ్లగా.. ఇంట్లో కవిత తన బిడ్డతో ఉన్నది. ఈ క్రమంలో స్కూటీపై ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు ఇంటికి వచ్చారు. ఒకరు బయట ఉండగా.. మరొకరు ఇంట్లోకి వచ్చి.. 'మీ బాబుకు జ్వరం వచ్చిదంట.. చిన్నారిని దవాఖానకు తీసుకురమ్మని మీ భర్త రవి చెప్పాడు' అని ఊయలలో ఉన్న బిడ్డను ఎత్తుకునేందుకు వెళ్లారు. తన కుమారుడికి జ్వరం రాలేదని, బిడ్డను ఎవరికి ఇవ్వనంటూ తెగేసి చెప్పింది. అనుమానంతో వెంటనే భర్తకు ఫోన్ చేసేందుకు యత్నించగా ఆగంతకుడు బిడ్డను ఎత్తుకెళ్లేందుకు యత్నించాడు. భయంతో కవిత కేకలు వేసి అతడిని ప్రతిఘటించింది. చుట్టుపక్కల వారు అక్కడి రావడంతో స్కూటీపై ఇద్దరూ పరారయ్యారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసిన పోలీసులు సదరు వ్యక్తుల ఆచూకీ కోసం గాలిస్తున్నారు.

## 200 వలస పక్షులు మృతి

- సాగర్ వెనుక జలాల్లో పక్షుల కళేబరాలు

హైదరాబాద్, జనవరి 25 (నమస్తే తెలంగాణ): నాగార్జునసాగర్ బ్యాక్‌వాటర్‌లో 200కుపైగా వలస పక్షులు మృత్యువాత పడ్డాయి. భారీ ఎత్తున వలసపక్షుల కళేబరాలు ఒకేచోట కనిపించడంతో ఈ ప్రాంతానికి విహారయాత్రకు వచ్చిన పర్యాటకులు అటవీ శాఖ అధికారులకు సమాచారమిచ్చారు. దీనిపై విచారణ జరపాలని నాగార్జునసాగర్ డీఎఫ్‌వో పీ రాజశేఖర్‌ను అటవీశాఖ ఆదేశించింది. దక్షిణాసియా ప్రాంతం నుంచి శీతాకాలంలో తెలంగాణకు పెద్ద ఎత్తున వలస పక్షులు వస్తుంటాయి. నవంబర్ నెలలో వచ్చే ఈ పక్షులు తమ సంతానాన్ని వృద్ధి చేసుకొని తిరిగి మార్చి, ఏప్రిల్ నెలల్లో తమ సొంత ప్రాంతాలకు వెళ్తుంటాయి. అవి నివసించినంత కాలం పక్షి ప్రేమికులకు కనువిందు చేస్తాయి. ఇటీవల నాగార్జునసాగర్ బ్యాక్ వాటర్ (వెనుక జలాల)లో 200కుపైగా బ్రౌన్–హెడ్ గల్స్, బ్లాక్–హెడ్ గల్స్ (వలసపక్షులు) మృత్యువాత పడటం పక్షి ప్రేమికులను ఆందోళనకు గురిచేసింది. వైల్డ్‌లైఫ్ ఫొటోగ్రాఫర్ శ్రీరామ్‌రెడ్డి వాటిని ఫొటోలు తీసి, చీఫ్ వైల్డ్‌లైఫ్ వార్డెన్ ఎంసీ ఫర్గెయిన్‌కు పంపించారు. దీనిపై స్పందించిన ఫర్గెయిన్ విచారణకు డీఎఫ్‌వో రాజశేఖర్‌ను ఆదేశించారు. ఘటనా స్థలాన్ని పలువురు అటవీ అధికారులు బుధవారం సందర్శించారు. పక్షుల మరణానికి గల కారణాలను వారు వెంటనే గుర్తించలేకపోయారు. వాటి నమూనాలను సీసీఎంబీ తదితర పరిశోధన సంస్థలకు పంపారు. పంటలకు చల్లిన రసాయనాలను తినడం వల్లనా లేక ఇతర కారణాల వల్ల పక్షులు మృతి చెందాయా అన్నది శాస్త్రీయ పరిశోధనల్లో వెల్లడవుతుందని అధికారులు పేర్కొన్నారు.

# వెయ్యేండ్లు ఉండేలా వేయి స్తంభాల కల్యాణమండపం

- మార్చిలోపు పునర్నిర్మాణ పనులు పూర్తి
- యునెస్కో గుర్తింపునకు ఈ ఆలయం ప్రతిపాదన
- కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ రావత్

వరంగల్, జనవరి 25 (నమస్తేతెలంగాణ ప్రతినిధి): హనుమకొండలోని కాకతీయుల కాలం నాటి వేయి స్తంభాల ఆలయ కల్యాణ మండపం పనులను మార్చిలోగా పూర్తి చేస్తామని కేంద్ర పురావస్తు శాఖ డైరెక్టర్ జనరల్ యధుబీర్‌సింగ్ రావత్ తెలిపారు. ఇప్పటికే 90 శాతం పనులు పూర్తయ్యాయని, రెండు నెలల్లో మిగిలిన పనులు పూర్తవుతాయని అన్నారు. పునర్మించిన కల్యాణ మండపాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీతో ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తే దేవాలయం చుట్టూ ఉన్న ఇండ్లను తొలగించి అక్కడి వారిని వేరే ప్రాంతాలకు తరలించేలా చేస్తే వెయ్యి స్తంభాల ఆలయాన్ని రామప్ప తరహాలో యునెస్కో గుర్తింపు కోసం ప్రతిపాదనలు పంపుతామని చెప్పారు. కేంద్ర పురావస్తు శాఖ అడిషనల్ డైరెక్టర్ జాన్ వీజ్‌శర్మ, డైరెక్టర్ రాంజినగమ్, రీజినల్ డైరెక్టర్ పాఠక్, హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ స్మిత్ ఎస్ కుమార్, ఇంజినీర్ కృష్ణచైతన్యతో కలిసి డైరెక్టర్ జనరల్ యధుబీర్‌సింగ్ రావత్ గురువారం వేయి స్తంభాల ఆలయాన్ని పరిశీలించారు. త్రికూటాలయం చుట్టూ కింది భాగంలో రెండు లేయర్లు పూర్తిస్థాయిలో పైకి తీయాల్సిన అవసరం ఉన్నదని, త్వరితగతిన పూర్తి చేసి గార్డెన్‌ను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దుతామని పురావస్తుశాఖ జిల్లా అధికారి మల్లేశం వారి దృష్టికి తీసుకొచ్చారు. వీరి వెంట ఆలయ ఈవో కే వెంకటయ్య, ప్రధానార్చకుడు గంగు ఉపేంద్రశర్మ, ప్రొఫెసర్ పాండురంగారావు ఉన్నారు.


